AIJRELPLS VOLUME 5, ISSUE 1 (2020, JAN/FEB) (ISSN-2456-3897)ONLINE
Anveshana's International Journal Of Research In Education, Literature, Psychology And Library Sciences

**" బహుజనం దరికి నాటకం "**

**~డా.బెల్లి యాదయ్య**

ప్రధానాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,

రామన్నపేట యాదాద్రి భువనగిరి జిల్లా.

" An art form requires genius. People of genius are always troublemakers, meaning they start from scratch, demolish accepted norms, and rebuild a new world "

--Henri Langlois

కథ కథనం తమదైతే ఎముకలు కొరికే చలిని సైతం జయించి,నిద్ర కంటిని కుట్టే రాత్రి లో చెమటోడ్చిన అలసటను పక్కన పెట్టి ఆస్వాదన మీద ఆసక్తి ని కనబరుస్తూ నాటకానికి ఊరి జనం జేజేలు పలుకుతారని రుజువు చేసిందో గ్రామం.దాని పేరేచెర్వుఅన్నారం. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని ఈ గ్రామం కమ్యూనిజానికి కంచుకోట.కనెక్టివిటీ దృష్టితో చూసినప్పుడు చెర్వుఅన్నారం జాతీయ రహదారికి ఆరుకిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ మూలాల్ని మరచిపోని రెక్కల మనుషుల ఆవాసం అది.ప్రాపంచికతను గురించి వైవిధ్యంగా ఆలోచించడం అలవాటున్న అక్కడి విద్యావంతులు, ఉద్యోగాల్లో స్థిరపడ్డవాళ్లు 'గ్రామ విద్యాభివృద్ధి కమిటీ ' గా ఏర్పడ్డారు.పార్టీలకు అతీతంగా ఒక్కటై పెద్దవాండ్లను కలుపుకొని విద్యావిజ్ఞానసాంస్కృతిక కార్యక్రమాలను భావజాలం పునాదిగా భవిష్యత్తరాల దిక్సూచిగా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు.అట్లా జరుగుతున్న కార్యక్రమాల్లో భాగమే డిసెంబర్ 26,27,28 తేదీల్లో జరిగిన "బహుజన నాటకోత్సవాలు".

అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శించబడిన ' సంఘం శరణం గచ్ఛామి,సత్యశోధన,వినురవేమ ' నాటకాలు ప్రేక్షకుల నీరాజనాలు అందుకున్నాయి.అత్యాధునిక సాంకేతిక విజ్ఞానాన్ని ఇముడ్చుకున్న తీరు అన్ని క్రాఫ్ట్ లతో పాటు ఈ నాటక నిర్వహణ లో ప్రత్యేక ఆకర్షణ, హైలెట్.ప్రదర్శనకు రంగభూమిని ఇచ్చిన ఆ ఊరి చిన్నబడి ఈ దేశంలో ని ఏడు లక్షల గ్రామాల సర్కారు స్కూళ్లతో

పోల్చిచూసినప్పుడు వేనోళ్ల నుతించ దగినది.అశుచి అనారోగ్యం వైకల్యం వినోదరంగంలో ప్రదర్శనా కళల్లో నిరంకుశంగా రాజ్యమేలుతున్న నేపథ్యంలో స్థల కాలాల్ని దృష్టి లో ఉంచుకొని మాట్లాడుకున్నపుడు రచన రీత్యా , ప్రదర్శన రీత్యా, ఆస్వాదన రీత్యా ఈ బహుజన నాటకోత్సవాలు చారిత్రాత్మకమనే చెప్పాలి.కేవలం వినోదం కోసమే వీక్షించం,మా రక్తనాళాల్లోకి ధమనులు సిరల్లోకి నూతన చైతన్యం నింపుకోడానికి ఆసాంతంనిబద్ధతో తిలకిస్తాం అన్నట్టు జరిగిన ఈ నాటకాల ప్రారంభ సమాపన ఉత్సవాల్లో రాజకీయ ప్రముఖుల భాగస్వామ్యం లేకుండా జాగ్రత్త పడిన నిర్వహణ కమిటీ వివేకాన్ని ఎంతైనా అభినందించి తీరాల్సిందే.

సమాజాన్ని విద్య, రాజకీయాలు ప్రభావితం చేసినట్టుగా మరేవీ ప్రభావితం చేయలేవు. వేమన, మహాత్మాఫూలే, డా.అంబేడ్కర్ మహానుభావుల జీవన కథనాలను నాటకాలుగా రూపొందించిన తీరులో రచయితలు కె .దేవేంద్ర(సంఘం శరణం గచ్ఛామి,సత్య శోధన),కె.వై.నారాయణ స్వామి(వినురవేమ వేమ) లు దర్శకులు శివప్రకాశ్ తూము(సంఘం శరణం గచ్ఛామి,సత్య శోధన),బసవ లింగయ్య(వినురవేమ లు విద్యా రాజకీయ కోణాలనే ప్రధాన సూత్రంగా చేసుకున్నారు.సామాన్య కళాకారులైన నటీనటులే సాంకేతిక నిపుణులై వారి సమన్వ కర్త జగ్గరాజు గారుతో మమేకమై రచయితల దర్శకుల ఆలోచనలకు మరింత పదును పెట్టి శతధా సహస్రధాఆహార్యంలో ఆంగిక వాచికాభనయాల్లో మద్దతుగా నిలబడ్డారు.సాంస్కృతిక రంగంలో వ్యక్తులు,వంశాలు, వర్గాలు తమ కీర్తిని చరిత్రను ప్రచారం చేయించుకుంటున్న దరిమిలా ప్రచారం కావాల్సింది కీర్తి చరిత్ర లు కాదు , సత్యం జ్ఞానం అని ఈ నాటకాలు ప్రతిధ్వనించాయి.అన్నారం ప్రజలు నాటాకాల్లో సత్యం జ్ఞానాలనే అన్వేషించినట్టు సంవీక్షణంలో రెస్పాన్స్ లో తీక్షణంగా బహిర్గతం పరిచారు.ఎవరెవరు వాళ్ల వాళ్ల అవసరాలకోసం ఎన్నెన్ని భ్రమల్ని కల్పించినా తమకు కావాల్సింది సత్యస్పృహ, జ్ఞాన ఆవిష్కరణ అని నాటాకాలకు తామే స్పాన్సర్లుగా ఆదరించి శ్రామికజనం నిరూపించారు.

ప్రస్తుత సమాజానికి అత్యవసరమైన స్వాభావికాంశాలపైన ఇటీవల పరిశోధన చేసిన మిచిగాన్ విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం ఆరు ముఖ్యాంశాలను ప్రతిపాదించింది.అవి 1.అవగాహన (Understanding), 2.వినయం (Humility),3.ఔదార్యం(Generosity),4.సృజనాత్మకత(Creativity),5.చింతన(Thought),6.క్షమాగుణం (Forgiveness). ఈ షడ్గుణాల ఉద్దీపనకే మూడు దృశ్య కావ్యాలు ప్రాధాన్యతనివ్వడం విశేషం. క్రిందటి మూడు శతాబ్దాల సాంఘిక ప్రవర్తనను, పరివర్తనను చూపరులు హేతుబద్ధంగా మాట్లాడుకునే అవకాశాన్ని ఈ నృత్య గాన

రూపకాలు కల్పించాయి. వేమన ,పూలే ,అంబేడ్కర్ ముగ్గురూ ఆ యా కాలాలు స్థలాలు ఆవిష్కరించుకున్న మూర్తిమంతులు,సంస్కర్తలు,మహోపాధ్యాయులు.వారి జీవన మూల్యాంకనం,ఆచరణ మన తరానికి ప్రాసంగికత. అందుకే ఈ నాటకాలు ఆకట్టు కోగలిగినాయి.అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ప్రజలను ఎడ్యుకేట్ చేయగలుగుతుంది అనడానికి 'సంఘం శరణం గచ్ఛామి' నాటకం మూడువందల ముప్పై ప్రదర్శణలు పూర్తి చేసుకోవడమే ఉదాహరణ.

వేమన,పూలే, అంబేడ్కర్ లను స్మరిస్తూ ఆయా భాషల్లో చలన చిత్రాలు వచ్చాయి.సుప్రసిద్ధ నటీనటుల అద్భుత నటన ద్వారా అవి రక్తి కట్టి విజయవంతం అయ్యాయి కూడా. ఐతే మనం ఎంత కాదనుకున్నా సినిమా వ్యాపార ప్రధానమైన వినోదం మాధ్యమం.దీనికి ప్రజానాటకం పూర్తిగా భిన్నమైంది.ప్రజల నుండి ప్రజలు కొరకు ప్రజల చేత రూపుదిద్దుకుని ప్రజల మధ్య ప్రదర్శించబడే ప్రజాస్వామిక ప్రక్రియ.ప్రత్యమ్నాయాల అన్వేషణ .సమాంతర దృక్పథాల సృజన,శాంతి కాముకత , ఉత్పాదకత -నైతికతల సముద్ధరణ,సమసమాజ స్థాపన ఈ బహుజన నాటకాల లక్ష్యం.ఈ దిశగా సాగుతున్న అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారి ఆశలు ఆశయాలు వర్ధిల్లాలి.

అన్నారం గ్రామం విద్యా వంతుల వలెనే ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని గ్రామాలతో పాటు దేశం లోపల వెలుపల తెలుగు మాట్లాడే ప్రాంతాల్లోని యువత,పోషక సమాజాలు ఈ నాటకాల ప్రదర్శనకు చొరవ చూపాలి.వర్ణ అహంబావం,అగ్రకుల దౌష్ట్యాలు అంతరించి సద్గుణాలను, సంఘ సమతౌల్యతను పురికొల్పేశక్తికి, మూఢాచారాలు బూడిదై ముమ్మాటికీ సైన్సు నెగ్గడం వైపుకు మేలుకొనే నడవడికకు, ఉత్పత్తి కులాల శూద్రుల అతిశూద్రుల విద్యా ఉపాధి స్వావలంబన కు రాజ్యాధికార కల సాకారానికి ఈ 'సత్యశోధన,సంఘం శరణం గచ్ఛామి' నాటకాలు తాత్వికంగా బాటలు వేస్తాయి.ఆర్ష వర్గం వల్లెవేసే వేదోక్తులకంటే అంతరాత్మ, చిత్తశుద్ధి,స్వీయ పరిపూర్ణత మేరకు మసలుకోవడం వైపుకు మనుషుల్ని మల్లేసే తేటతెలుగు వేమన పద్యాలే గొప్పవని 'వినుర వేమ' నాటకం చూసిన ప్రతి ఒక్కరూ గ్రహిస్తారు.దర్బారు నివాసపు డొల్లతనం మీద తిరుగు బాటుగా వేమారెడ్డి సన్యాసివేమనగా బోధించిన తత్వాలే విప్లవమని శ్లాఘిస్తారు. 'Maturity starts when drama ends 'అనే లోకోక్తి కి తార్కాణగా ' అడుగు వర్గాలకు పరిపక్వత ఎప్పుడైతే వస్తుందో అప్పుడే ఆధిపత్య వర్గాల నాటకాలు ముగుస్తాయి 'అనేదే ఈ బహుజన నాటకోత్సవాలు ఇచ్చిన సందేశం. జయహో!జనరూపకం.దిగ్విజయహో!! బహుజన నాటకం